# ప్రజలకు అందుబాటులో ఉంటూ
# పారదర్శకంగా సేవలందిస్తా -ఆదోని నూతన ఆర్డీవో కె.అరుణ దేవి

ఆదోని నూతన రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతల స్వీకరణ




**ఆదోని,జూలై10.అక్షర టైమ్స్:-** ఆదోని రెవెన్యూ డివిజన్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీవో) కె. అరుణ దేవి శుక్రవారం ఉదయం 9.00 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న ఆమెకు అధికారులు, ఉద్యోగులు, రెవెన్యూ శాఖ సిబ్బంది, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్డీవో కె. అరుణ దేవి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సకాలంలో, పారదర్శకంగా చేరేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల సమర్థ అమలుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని వెల్లడించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శక పరిపాలన అందించడమే తన లక్ష్యమని, అధికారులు, సిబ్బంది సమిష్టి సహకారంతో ఆదోని రెవెన్యూ డివిజన్‌కు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలన అధికారి నవీన్ కుమార్, ఆదోని తహసీల్దార్ శేషఫణి, కౌతాళం తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు మరియు ఇతరులు పాల్గొని నూతన ఆర్డీవోకు శుభాకాంక్షలు తెలియజేశారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా


# వాల్మీకుల చైతన్య సదస్సు జయప్రదం చేయండి

రాష్ట్రంలో 40 లక్షల వాల్మీకుల అభ్యున్నతికి చైతన్య సదస్సు కీలకం..

రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని

పిలుపు: రామ్ భీం నాయుడు




**కోసిగి,జూలై10.అక్షర టైమ్స్:-** వాల్మీకుల ఎస్టీ హక్కుల సాధన లక్ష్యంగా ఈ నెల 19న కోసిగి పట్టణంలో నిర్వహించనున్న వాల్మీకి చైతన్య సదస్సును విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామ్ భీం నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం కోసిగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాలకు చెందిన వాల్మీకి కుటుంబాలు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరుకావాలని కోరారు. దశాబ్దాలుగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఉద్యమాలు, వినతులు, పోరాటాలు కొనసాగుతున్నప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో వాల్మీకుల డిమాండ్‌కు అనుకూల వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి ఎస్టీ హోదా సాధనకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది వాల్మీకులు ఉన్నారని, వారికి ఎస్టీ హోదా కల్పిస్తే విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ చూపితే వాల్మీకుల చిరకాల ఆకాంక్ష నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాల్మీకుల భవిష్యత్తు తరాల అభ్యున్నతి కోసం నిర్వహిస్తున్న ఈ చైతన్య సదస్సుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు జ్ఞానేశ్, హనుమంతు, నాగేష్, దిద్దె నాగేష్, హనుమన్న, వెంకటేష్, బసవరాజు, వెంకటరాముడు, గోపాల్, గాదిరెడ్డి, అనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

# విలేకరులను,ఓటర్లను సైతం దురుసుగా
# ప్రవర్తించిన బిఎల్ఓ పై చర్యలు తీసుకోవాలి

తాసిల్దార్,ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్



**బ్రహ్మంగారిమఠం,జూలై10.అక్షర టైమ్స్:-** బాధ్యత గల ఒక అధికారి ఓటర్ల సవరణ(సర్) ప్రోగ్రాంలో నిర్లక్ష్యంగా దురుసుగా ఓటర్లను మరియు విలేకరిని సైతం దురుసుగా ప్రవర్తించిన బిఎల్ఓ పై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక విలేకరులు అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఇది.వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని కొత్తూరు గ్రామం నందు వార్డులో ఉన్న ఓటర్లను మరియు విలేకరిని ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా సమాచారం కోసం ఆ వార్డు బిఎల్ఓ చంద్ర ను ఫోనులో సంప్రదించాలనుకున్న విలేకరిని దురుసుగా మాట్లాడడమే కాకుండా మాట్లాడుతున్నంగనే నిర్లక్ష్యంగా ఫోన్ కట్ చేసిన బిఎల్ఓ పై చర్యలు తీసుకోవాలని బి.మఠం తాసిల్దార్ మరియు ఎంపీడీవోలకు స్థానిక విలేకరుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆవుల దస్తగిరి నాయుడు,అధ్యక్షులు సారె రామానాయుడు,ప్రధాన కార్యదర్శి పత్తి సురేష్ శుక్రవారం ఫిర్యాదు చేయడం జరిగింది.విధి నిర్వహణలో ఉన్నటువంటి బిఎల్ఓ ఆ వార్డులో ఉన్నటువంటి ఓటర్లను సయితం దురుసుగా మాట్లాడటమే కాకుండా యక్ష ప్రశ్నలన్నీ వేసి ఓటర్లను తికమక పరుస్తూ,ఆయనకు సమాధానం చెప్పలేక ఈ ఓటు కూడా మాకు వద్దులే అనేతీత విసుగు తెప్పిస్తున్న బి ఎల్ ఓ పై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక విలేకరులు మండల అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలియజేశారు.అదే కాకుండా రామాలయం వద్ద కూర్చుని అందర్నీ అక్కడికే పిలిపించుకొని ఓటర్లను దురుసుగా మాట్లాడుతూ అందరితో వాదనలకు తిరుగుతూ ఉండటాన్ని వారు తీవ్రంగా దుయ్యబుట్టారు.ఇతను సోమిరెడ్డిపల్లె-1 సచివాలయం లో డిజిటల్ అసిస్టెంట్ గా పని చేయుచున్న సమయంలో కూడా అక్కడికి వచ్చిన వారిని కూడా ఇలాగే ప్రవర్తించేవాడని అక్కడ పనిచేయుచున్న కొందరు సమాచారం అందించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బి ఎల్ ఓ చంద్ర పై చర్యలు తీసుకోవాలని వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

# మాటల కంటే ఫలితాలే గొప్పవని నిరూపించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో ఆంధ్రప్రదేశ్‌కు రెండో ర్యాంకు

పంచాయతీరాజ్ శాఖలో పవన్ కళ్యాణ్ నాయకత్వానికి దక్కిన గుర్తింపు




**బ్రహ్మంగారిమఠం,జూలై10.అక్షర టైమ్స్:-** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు వెన్నెముక వంటివి. ఒక గ్రామానికి నాణ్యమైన రహదారి అందుబాటులోకి వస్తే విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, వాణిజ్యం వంటి అనేక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఈ దృష్టితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎం జి వై ) దేశవ్యాప్తంగా గ్రామీణ రహదారి అనుసంధానాన్ని బలోపేతం చేస్తోంది. ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండవ ర్యాంకు సాధించడం రాష్ట్రానికి గర్వకారణం. ఈ ఫలితాలు రాష్ట్రంలో పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి రంగాల్లో జరిగిన కృషికి ప్రతిబింబంగా నిలిచాయి. ఈ శాఖకు బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పనుల వేగం, నాణ్యత, పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించబడిందని ప్రభుత్వం పేర్కొంటోంది.

**అభివృద్ధికి ప్రాధాన్యం**

పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రాధాన్య అంశంగా తీసుకున్నట్లు ప్రభుత్వ కార్యక్రమాల్లో కనిపించింది. గ్రామీణ రహదారుల నిర్మాణం, పూర్తి కాలేని పనులను వేగవంతం చేయడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టబడింది. అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించడం, పనుల పురోగతిని పరిశీలించడం, నిర్దేశిత గడువుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం వంటి పరిపాలనా చర్యలు పనుల వేగాన్ని పెంచడంలో దోహదపడ్డాయని అధికారులు వెల్లడించారు.

**రెండో ర్యాంకు వెనుక సమిష్టి కృషి**

ఈ విజయం ఒక్క వ్యక్తి కృషి మాత్రమే కాదు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కలిసి చేసిన సమిష్టి కృషి ఫలితమే. సమర్థవంతమైన నాయకత్వం, నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో ఈ ఫలితం సాధ్యమైంది.

**గ్రామీణ ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం**

నాణ్యమైన గ్రామీణ రహదారులు ఏర్పడడం వల్ల రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించగలుగుతున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సురక్షితంగా చేరుకుంటున్నారు. అత్యవసర వైద్య సేవలు గ్రామాలకు వేగంగా అందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాలు కూడా మెరుగుపడుతున్నాయి.



**భవిష్యత్ లక్ష్యం**

దేశంలో రెండో ర్యాంకు సాధించడం విశేషమైన విజయమే అయినప్పటికీ, ఈ విజయాన్ని నిలబెట్టుకోవడం, మరింత మెరుగైన ఫలితాలతో మొదటి స్థానాన్ని లక్ష్యంగా చేసుకోవడం అవసరం. ఇప్పటికే నిర్మించిన రహదారుల నిర్వహణ, కొత్త గ్రామాలకు అనుసంధానం, నాణ్యతను నిరంతరం కాపాడడం వంటి అంశాలపై దృష్టి కొనసాగితే రాష్ట్రం మరింత ముందుకు సాగే అవకాశం ఉంది. ముగింపు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో ఆంధ్రప్రదేశ్‌కు రెండో ర్యాంకు రావడం రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఒక ప్రోత్సాహకరమైన పరిణామం. ఈ విజయానికి ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన కృషి ప్రశంసనీయమైనది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ మౌలిక సదుపాయాలపై కొనసాగుతున్న దృష్టి ఇలాంటి ఫలితాలకు తోడ్పడిందని ప్రభుత్వం పేర్కొంటోంది. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తే ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది.



బొల్లు రామమోహన్,రచయిత, పోరుమామిళ్ల


# జనాభా దినోత్సవం
# సందర్భంగా వక్తృత్వ పోటీలు



**నంద్యాల,జూలై10.అక్షర టైమ్స్:-** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రావుస్ బాలికల జూనియర్ కళాశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ యువత ఆశయాలు నెరవేరే సమాజ నిర్మాణమే ప్రపంచ జనాభా దినోత్సవం లక్ష్యమని తెలిపారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను మానవ వనరుగా మలుచుకొని దేశాభివృద్ధికి వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. “అధిక జనాభా అనర్థదాయకమా.. ప్రయోజనకరమా” అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో కలిమా ప్రథమ, ఆస్మా తబసుం ద్వితీయ, సింధు తృతీయ స్థానాలు సాధించగా, అక్షయ దేవి, వైష్ణవి, హాఫీజ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో రావుస్ కళాశాలల చైర్మన్ అప్పారావు, డైరెక్టర్ మౌని చంద్ర, కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్, ప్రిన్సిపాళ్లు సుంకయ్య, సంగమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సూక్ష్మ పరిశ్రమలకు ఊతం

విశ్వనగర్‌లో డైరీ యూనిట్ ప్రారంభించిన కలెక్టర్



**నంద్యాల,జూలై10.అక్షర టైమ్స్:-** జిల్లాలో సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని విశ్వనగర్‌లో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఏర్పాటు చేసిన ఎస్ఎస్ డైరీ మిల్క్ అండ్ కర్డ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక వనరులతో చిన్న పరిశ్రమలు స్థాపించి యువత, మహిళలు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. రూ.18.14 లక్షల వ్యయంతో ఏర్పాటైన ఈ యూనిట్‌కు ప్రభుత్వం రూ.6.35 లక్షల సబ్సిడీ అందించిందన్నారు. జిల్లాకు పీఎంఎఫ్ఎంఈ పథకం కింద 56 యూనిట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటికే 26 యూనిట్లకు రుణాలు మంజూరయ్యాయని, మిగిలిన యూనిట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ‘వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్’ లక్ష్యంతో మరిన్ని సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించి గ్రామీణ ఉపాధిని విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం కార్తికేయ, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పశుసంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్, ఎల్‌డీఎం అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయం 1లో
# పనిచేయని ప్రింటర్లు అందుబాటులో లేని సిబ్బంది

రిసిప్ట్ కావాలంటే బయట ప్రింట్ తీసుకోవాలి,ఇబ్బంది పడుతున్న ప్రజలు



**బ్రహ్మంగారిమఠం,జూలై10.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారిమఠం లోని సచివాలయం 1 లో గత కొంతకాలంగా ఆఫీసులో ఉన్న ప్రింటర్లు ఏవి కూడా పనిచేయడం లేదు. అంతేకాకుండా సిబ్బంది ఎవ్వరూ కూడా అందుబాటులో ఉండడం లేదు. ప్రజలు వచ్చి ఏ పని అడిగినా కూడా సర్ కార్యక్రమం మీద సాకులు చెబుతూ ఉన్నారు. ఇంటి పన్నులు చెల్లించాలన్న, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్న మరి ఏ ఇతర పత్రాలు పొందాలన్నా కూడా అక్కడ సిబ్బంది అందుబాటులో లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ సిబ్బంది అందుబాటులో ఉన్నా కూడా అక్కడ ఉన్న ప్రింటర్ లు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సచివాలయం లోకి వెళ్లిన ప్రజలు ఏ పని చేయించుకున్న కూడా ప్రింట్ కావాలంటే బయట ఉన్న నెట్ సెంటర్ల లోకి వెళ్లి ప్రింట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతకాలం ప్రింటర్లు పనిచేయకున్నా అక్కడ ఉన్న పంచాయతీ సెక్రటరీ వాటిని తయారు చేయకుండా అలాగే ఉంచుకున్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి ఒక్క సర్వీస్ కూడా సచివాలయంలో ఉన్నాయి కానీ సిబ్బంది కొరతకు మరియు ప్రింటర్లు పనిచేయకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఎస్ఐఆర్ పై రాజకీయ
# పార్టీల విమర్శలు అర్థరహితం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లె,జూలై10.అక్షర టైమ్స్:-** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాజకీయ పార్టీలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన సమావేశంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ, మరణించినవారు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిపోయినవారు, అక్రమంగా వలస వచ్చిన వారి పేర్లను తొలగించి ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 1952 నుంచి దేశవ్యాప్తంగా పలుమార్లు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలు నిర్వహించారని, ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియను రాజకీయ కోణంలో చూడడం సరికాదన్నారు. ఈసారి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో ఓటరు జాబితాను పరిశీలించి నకిలీ, అక్రమ ఓట్లను గుర్తించి తొలగించడమే లక్ష్యమని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ మతానికో, వర్గానికో వ్యతిరేకం కాదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను నవీకరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకుడు ముద్ది శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లి-చాగలమర్రి

# రహదారి విస్తరణకు మోక్షం లేదా.?

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. తులసి రెడ్డి



**వేంపల్లె,జూలై10.అక్షర టైమ్స్:-**వేంపల్లి-చాగలమర్రి జాతీయ రహదారి విస్తరణ పనులకు ఇప్పట్లో మోక్షం లేదా? అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ, వేంపల్లి--వీరపునాయునిపల్లి--యర్రగుంట్ల--ప్రొద్దుటూరు--కొర్రపాడు--రాజుపాలెం--చాగలమర్రి జాతీయ రహదారి (ఎన్‌హెచ్--440)ను రెండు/నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2023--24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,321.02 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసిందన్నారు. ఈ రహదారి మొత్తం పొడవు 78.95 కిలోమీటర్లు అని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు టెండర్లు పూర్తి కాగా, ఎన్‌ఎస్‌పీఆర్ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పనులు చేపట్టేందుకు ఎంపికైందన్నారు. అయితే జిల్లా రెవెన్యూ యంత్రాంగం భూసేకరణ పూర్తి చేయకపోవడంతో మూడేళ్లు గడిచినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నూతన పంచాయతీ ఈఓగా జీ.కవిత బాధ్యతలు


### సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: నూతన ఈఓ



**వేంపల్లె,జూలై10.అక్షర టైమ్స్:-** స్థానిక గ్రామ పంచాయతీ నూతన ఎగ్జిక్యూటివ్ అధికారిణి (ఈఓ)గా జీ. కవిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈఓ జీ. కవిత మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి సత్వర చర్యలు చేపడతామని తెలిపారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, పంచాయతీ సిబ్బంది శివరామ్, చాను, గౌస్, రాహుల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నివాస గృహ పునర్నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన మఠాధిపతి





**బ్రహ్మంగారిమఠం,జూలై10.అక్షర టైమ్స్:-** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి చారిత్రక నివాస గృహ పునర్నిర్మాణ పనులకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు శుక్రవారం శుభముహూర్తంలో భూమిపూజ నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన ఇంటాక్ (ఇంటక్ ) సంస్థ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, శుభదినమైన శుక్రవారం మఠాధిపతి స్వయంగా నివాస గృహం వద్ద టెంకాయ కొట్టి, వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ కార్యక్రమం విజయవంతం కావాలని ప్రార్థించారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నివాస గృహానికి ఆనుకుని ఉన్న పురాతన శ్రీ సీతారామాలయాన్ని దర్శించుకుని, శ్రీ సీతారామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి సోదరుడు శ్రీ దత్తాత్రేయ స్వామి, ప్రధాన అర్చకులు బ్రహ్మయ్య స్వామి, బేస్తవారిపేట అర్చకులు కేశవ, కందిమల్లయ్య పుర గ్రామ ప్రజలు,మఠం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి ఆరోగ్యవంతులుగా జీవించండి

### సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ




**బద్వేల్,జులై10.అక్షర టైమ్స్:-** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు. బద్వేల్ మండలంలోని, శీలం వారి పల్లెలో, శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది బ్యానర్ చేతపట్టి, ర్యాలీని నిర్వహించారు. దోమ పుట్టకూడదు, కుట్టకూడదు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి ,అర్హులైన వైద్యులచే వైద్యం చేయించుకోండి అంటూ నినాదాలు చేసి, ప్రజలను చైతన్యవంతం చేశారు. ఇంటింటి ఫీవర్, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ, జూలై మాసంలో వర్షాలు పడే అవకాశం ఉందని, దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ దోమల వలన మలేరియా, డెంగ్యూ ,చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. దోమలు పుట్టకుండా లార్వాదశలోనే నివారించాలన్నారు. జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల చివరి వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి వారం ఫ్రైడే డ్రైడే నిర్వహించి, ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని పడవేస్తున్నామన్నారు.శీలం వారి పల్లె బైపాస్ రోడ్డులో రక్తపరీక్షలు. శీలం వారి పల్లె బైపాస్ రోడ్డులో నిర్మాణ పనులు చేయుచున్న కార్మికులకు రక్త నమూనాలు సేకరించడం జరిగింది. అవసరమైన వారికి మందులను ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్ధన్ రావు, శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య ,వైద్య సిబ్బంది ,నాగమణి ,ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూ పాఠశాలను పునః ప్రారంభించండి

### కమిషనర్,ఎంఈఓ లకు కాంగ్రెస్ పార్టీ నేతల వినతి



**కడప,జూలై10.అక్షర టైమ్స్:-** కడప నగరంలోని గుర్రాలగడ్డ, బ్రాహ్మణ వీధిలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను పునః ప్రారంభించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ శుక్రవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భవాని ప్రసాద్, కడప మండల విద్యాశాఖ అధికారి రఫీక్ అహ్మద్ లకు వేర్వేరుగా సమర్పించిన వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. సుమారు 40 ఏళ్ల నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల వేల మంది విద్యార్థులకు విద్యాబోధన అవకాశం కల్పించిందన్నారు. అయితే ఇటీవల ఉపాధ్యాయుల నియామకం, పాఠశాల నిర్వహణ లోపాలు ఇతర సమస్యలతో పాఠశాల లో విద్యార్థులు తగినంత మంది లేరని సదరు పాఠశాలను అధికారులు తాత్కాలికంగా మూసి వేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చక్కగా చదువుకునే అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ఓ వైపు ప్రచారం చేయడం, అందుకు విరుద్ధంగా ఉర్దూ పాఠశాలను మూసివేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. స్థానిక గుర్రాలగడ్డ ప్రాంతం ప్రభుత్వ గుర్తింపు పొందిన మురికివాడగా పేర్కొన్నారు. అక్కడ నిరుపేద ముస్లింలు నివసిస్తున్నారని వారికి ప్రభుత్వ ఉర్దూ పాఠశాల మినహా ఇతర పాఠశాలల్లో చదివే ఆర్థిక శక్తి లేదన్నారు. ఈ పాఠశాల మూసివేతతో అక్కడ చదువుకునే పిల్లలు చదువు మానేసి బాల కార్మికులుగా వివిధ పనుల్లో వెళు చున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వెంటనే పాఠశాలను పునః ప్రారంభిస్తే పేద పిల్లలు విద్యావంతులవుతారని వారు కోరారు. ప్రభుత్వం పాఠశాలలను కుంటి సాకులతో మూసివేయడం సబబు కాదన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివే శక్తి అక్కడి విద్యార్థుల కు లేదన్నారు. నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం పై అధికారులు వెంటనే దృష్టి సారించాలని కోరారు. లేదంటే ఈ విద్యా సంవత్సరం పూర్తిగా విద్యార్థులు నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారులను కలిసిన వారిలో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ భాష, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు హమీద్, రఫీ ఖాన్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ఆర్థిక చోదకశక్తి కేసీఆర్



2014లో తెలంగాణ ఏర్పడ్డ నాడు వ్యవసాయం సంక్షోభంలో ఉన్నది. పవర్ హాలీడేలపై పరిశ్రమల యాజమాన్యాలు ఉద్యమిస్తున్నాయి. కరెంట్ కష్టాలతో రాష్ట్రం మొత్తం చీకటిలో మగ్గుతున్నది. ఉమ్మడి రాజధాని పేరిట హైదరాబాద్‌లో ఆంక్షలు అమలవుతున్నాయి. వలస పాలనలో 60 ఏండ్ల విధ్వంసం తర్వాత ఏది, ఎక్కడ, ఏ స్థితిలో ఉందో స్పష్టత లేని అయోమయ వాతావరణంలో కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ పునర్నిర్మాణ ప్రక్రియ మొదలైంది. తెలంగాణలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి రెండేండ్ల సమయం పట్టవచ్చని, అందరూ సహకరించాలని అంతకుముందు ఎన్నికల సభల్లోనే ప్రజలను కేసీఆర్ కోరారు. ఒకవైపు ఏడు మండలాలతో పాటు సీలేరు విద్యుత్తు కేంద్రాన్ని ఆంధ్రలో కలపడం, కాళ్లల్లో కట్టెలు పెట్టినట్టు విద్యుత్తు పీపీఏలను చంద్రబాబు రద్దు చేయడం వంటి అనేక సమస్యలు తొలి ప్రభుత్వానికి స్వాగతం పలికాయి. వాటన్నింటిని అధిగమించి రాష్ట్రం ఏర్పడిన అనతికాలంలోనే కేసీఆర్ విద్యుత్తు సమస్యను తీర్చారు. తద్వారా దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చిన తొలి రాష్ట్రంగా కీర్తి గడించారు. ఏదైనా సమస్యను పైపైన నామ్ కే వాస్తే అన్నట్టు అర్థం చేసుకుని, చూపే పరిష్కారం తాత్కాలికంగా తీవ్రతను తగ్గించినా దీర్ఘకాలికంగా ఆ సమస్య ఇంకా పెద్దదవుతుంది. కానీ, సమస్య మూలాల్లోకి వెళ్లి, కారణాలను విశ్లేషించి, మూలాల్లోంచి దాన్ని తొలగించేలా పరిష్కారం చూపితే క్రమంగా సమస్య తీవ్రత తగ్గుతుంది. కొంతకాలానికి ఆ సమస్యే కనుమరుగవుతుంది. కేసీఆర్ చేసింది ఇదే. కరెంట్ ఎప్పుడొస్తదని ఎదురుచూసే స్థితి నుంచి కరెంట్ పోతే వార్త అనే స్థాయికి తెలంగాణను తీసుకువచ్చారు కేసీఆర్. కరెంట్ కోసం ఇందిరాపార్కు వద్ద పరిశ్రమల యజమానులు ధర్నా చేసిన రోజుల నుంచి 2023 నాటికి తలసరి విద్యుత్తు వినియోగంలో జాతీయ సగటు (1,196 యూనిట్లు)ని మించి దాదాపు రెండింతలు (2,166 యూనిట్లు) పెరిగే స్థితికి చేర్చారు. ఈ ఆధునిక యుగంలో విద్యుత్తు ఒక నిత్యావసరం. మౌలిక వసతులతోపాటు డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లలో తీసుకొచ్చిన మార్పులు, క్వాలిటీని మెయింటెన్ చేయడం, గత పదేండ్లలో ఈ రంగంలో పెద్ద మొత్తంలో పెట్టిన మూలధన వ్యయంతో తెలంగాణ స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 25 వేల మెగావాట్లకు చేరుకున్నది. తెలంగాణను పవర్ బ్యాంక్‌గా మార్చిన ఘనత కేసీఆర్‌దే.

ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయానికి వస్తే, 2014లో రూ.40 వేల కోట్ల రెవెన్యూ ఆదాయంతో సమస్యల వలయంలో మొదలైన తెలంగాణ ప్రయాణం 2023 నాటికి రూ.1.6 లక్షల కోట్ల రెవెన్యూ ఆదాయానికి చేరింది. ఈ దశాబ్ద కాలంలో ఏ రాష్ట్రం కూడా ఇంతటి రెవెన్యూ పెరుగుదలను చూడలేదు. దీని వెనుక కఠోర శ్రమ ఉంది. కేంద్రం మద్దతు లేకుండానే, కేంద్రం పెట్టే ప్రజాకంటక విధానాలను తట్టుకొని, వారిచ్చే తాయిలాల వంటి సబ్సిడీలకు ఆశపడకుండా కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని చూసింది. బలమైన రాష్ట్రాలే బలమైన దేశానికి నాంది అని చెప్పే కేసీఆర్ ఫెడరల్ నినాదాన్ని ముందుగా తన పాలనలో, తన రాష్ట్రంలో అమలుచేసి చూపించారు. ప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గ్రామాల నుంచి మండలాలకు రోడ్లు, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు, గ్రామ గ్రామాన పల్లె ప్రకృతి వనాలు, ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, సమయానికి చెరువులను నింపడం, చేప పిల్లల పంపిణీ, శ్మశానవాటికల నిర్మాణం, చెత్త సేకరణ, హరితహారం, 24 గంటల కరెంట్, చెక్ డ్యాంల నిర్మాణం, రైతు వేదికలు, గురుకుల పాఠశాలలు, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు.. ఇవన్నీ కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి సాధ నాలు. ఇవే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసి రాష్ట్ర రెవెన్యూ పెరుగుదలకు దోహదపడ్డాయి. కాలంతోపాటు అర్బన్ రెవెన్యూ పెరగడం ఎక్కడైనా సహజమే. కానీ, రూరల్‌లో ఈ స్థాయిలో రెవెన్యూ పెరగడమనేది కేవలం తెలంగాణలోనే, కేసీఆర్ పాలనలోనే సాధ్యపడింది. నైపుణ్యం గల మానవ వనరులున్న తెలంగాణలో మన మాంసం అవసరాలను రాష్ట్రంలోనే తీర్చుకోలేమా? ఎందుకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద స్థాయిలో గొర్రెలను దిగుమతి చేసుకుంటున్నాం? అని కేసీఆర్ ప్రశ్నించుకున్నారు. ఆ ప్రశ్నల నుంచే గొర్రెల పంపిణీ పథకమనే సమాధానం పుట్టింది. ఆ పథకం మూలంగా రాష్ట్రంలో గొర్రెల సంఖ్యతోపాటే ఆయా వర్గాల ఉపాధి, వారి కొనుగోలు శక్తి పెరిగాయి. ఇవి రాష్ట్ర ప్రగతికి దోహదపడ్డాయి. గొర్రెల పెంపకంలో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. అత్యధిక తలసరి మాంసం అందుబాటులో ఉన్న రాష్ట్రంగా అవతరించింది. (29.21 కిలోలు/సంవత్సరం).

తెలంగాణ చెరువుల్లో కనుమరుగైన ఎర్ర రొయ్యలు, మంచినీటి చేపలు, చెరువులను ఎల్లప్పుడూ నీటితో నింపడం ద్వారా గ్రామీణ వ్యవస్థకు ఒనగూడే ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాల గురించి కేసీఆర్ సూక్ష్మంగా చర్చించిన సందర్భాలెన్నో. ఒక్కొక్క పని చేస్తూ, ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆయన చేసిన పనులు, తద్వారా గ్రామాల్లో జరిగిన ప్రగతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసింది. జనాభా ఎక్కువ ఉన్నచోట పెరిగిన మౌలిక వసతులు, ఉపాధి, సగటు గ్రామీణ తెలంగాణ కొనుగోలు శక్తే ప్రగతికి సూచికలు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌తో పాటు టైర్-2 నగరాలు, గ్రామాల్లో మూలధన పెట్టుబడిపై ఎక్కువగా దృష్టిసారించింది. అలాగే కేసీఆర్ హయాంలో సంక్షేమం కూడా అభివృద్ధికి దోహదపడే విధంగా సాగింది. సంక్షేమ పథకాలు పొందిన వర్గాల్లో మారిన వారి జీవనశైలి, పెరిగిన ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపై ఆశలతో మరింత మెరుగైన వృద్ధి వైపు అడుగులు వేసేలా చేశాయి. పెరిగిన సామాన్యుల జీవన ప్రమాణాలు ఆర్థిక వ్యవస్థకు మరింత దోహదం చేశాయి. ప్రతీ రంగంలోనూ ఉపాధికి కొత్త అవకాశాలు పుట్టుకొచ్చాయి. పింఛన్లు, రైతుబంధు, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపి ణీ, దళిత బంధు, బీసీ బంధు, 24 గంటల కరెం ట్, గ్రామాలకు మ్యాచింగ్ గ్రాంట్లు, రైతు బీమా లాంటి పథకాల ద్వారా నేరుగా గ్రామాల్లోకి డబ్బును పంపించడంతో వలసలు ఆగాయి. వలసల వాపస్‌నూ మనం చూశాం. స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్నాయి. తాము ఉన్నకాడనే ఉపాధి దొరుకుతుందనే ధీమా ప్రజల్లో కలిగింది. ఇలాంటి భరోసా కల్పించడమే కదా ఇంటి పెద్దగా ప్రభుత్వం చేయాల్సిన పని. వ్యవసాయం విషయంలో చెప్పుకోవాలంటే చర్విత చరణమే. మన దగ్గర పంట కొనలేక కేంద్రమే చేతులెత్తేసింది. కేంద్రం మీద ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వమే ధర్నా చేయాల్సినంత పంట పండింది తెలంగాణలో. వలసల జిల్లాలని పేరుపడ్డ పాలమూరు, కరీంనగర్‌లలో పక్క రాష్ట్రాల కూలీలు వచ్చినా ఇంకా డిమాండ్ ఉందంటే వ్యవసాయ రంగంలో ఏ స్థాయిలో ఉపాధి పెరిగిందో అర్థం చేసుకోవాలి. అత్యధిక జనాభా ఆధారపడిన వ్యవసాయాన్ని తొలి ప్రాధాన్యంగా భావించి నీళ్లు, కరెంట్, మార్కెటింగ్‌తో పాటు పెట్టుబడి కోసం రూ.72 వేల కోట్లను రైతుబంధు రూపంలో ఇవ్వడంతో పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులు, ఉపాధి పెరగడం, వ్యవసాయ ఆధారిత రంగాల్లో ప్రగతితో తెలంగాణలో వచ్చినంత మార్పు.. ఈ దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా రాలేదు.

తెలంగాణను ఎంఎస్ స్వామినాథన్ మెచ్చుకున్నారు. ఐక్యరాజ్యసమితి పొగిడింది. దేశం స్ఫూర్తిపొంది రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలను కాపీ కొట్టింది. కేసీఆర్ ప్రభుత్వం ఎంత నిశిత పరిశీలనతో, ప్రగతికాముకంగా పనిచేసిందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. కమలనాథులు ఊదరగొట్టే గుజరాత్ మోడల్ నుంచి ఒక్కటంటే ఒక్క పథకాన్నీ దేశం ఈ స్థాయిలో ఆమోదించలేదు. కానీ, అనతికాలంలోనే తెలంగాణ మోడల్ అంటే ఏంటో దేశం చూసింది. దేశాన్ని మనవైపు చూసేలా చేశారు కేసీఆర్. ఆర్థికరంగ నిపుణులు డాక్టర్ జీఆర్ రెడ్డి లాంటి వారి సూచనలు, కేసీఆర్ సూక్ష్మ, దూరదృష్టితో తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ జీవన ప్రమాణాల్లో, మౌలిక సదుపాయాల కల్పనలో, ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపడంలో అద్భుత విజయం సాధించింది. ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో అద్భుత ప్రగతిని మనం చూశాం. 2014-2023 మధ్యకాలంలో తెలంగాణ జీఎస్డీపీ రూ.4.5 లక్షల కోట్ల నుంచి రూ.16 లక్షల కోట్లకు చేరింది. ఈ పెరుగుదలను మెట్రో నగరమున్న మరే రాష్ట్రం సాధించలేకపోయింది. సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లలాగా సాగిన కేసీఆర్ పాలనలో నగరాభివృద్ధితోపాటు గ్రామీణాభివృద్ధి జరగడంతోనే ఇది సాధ్యమైంది. నిజానికి తెలంగాణలో, ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో గత పదేండ్లలో జరిగిన పనులు అనేక పరిశోధనలకు కేంద్రంగా మారాయి. 'తెలంగాణ వెనుకబడ్డ ప్రాంతం కా దు, వెనుకవేయబడ్డ ప్రాంతం. తెలంగాణ ధనిక రాష్ట్రం, సాంస్కృతిక వైభవమున్న రాష్ట్రం' అని ఉద్యమంలో చెప్పిన ప్రతీ మాటను తన పాలనలో, పనితీరుతో, సాధించిన ఫలితాలతో దేశం ముందు నిరూపించి, తెలంగాణను ఒక అభివృద్ధి మోడల్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు కేసీఆర్.

# సుంకాలతో వస్త్ర పరిశ్రమ కుదేలు!



డొనాల్డ్ ట్రంప్ సర్కార్ విధించిన సుంకాలు భారతీయ వస్త్ర పరిశ్రమ, ఎగుమతిదారులపై తీవ్రంగా పడింది. తమ ఆదాయం సగానికి పడిపోయినట్టు 34 శాతం వ్యాపార సంస్థలు నివేదించాయి. ఈ మేరకు కాన్ఫెడరేషన్‌ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. భారత వస్త్ర ఎగుమతుల కు అతిపెద్ద మార్కెట్ అమెరికా. మన దేశ మొత్తం వస్త్ర ఎగుమతుల్లో అమెరికా వాటా 10.8 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. భారత వస్త్ర ఎగుమతుల్లో ఇది సుమారు 30 శాతం. భారత ఎగుమతులపై ట్రంప్ సర్కార్ 25 శాతం అదనపు సుంకం, 25 శాతం జరిమానా, మొత్తంగా 50 శాతం సుంకం విధించింది. ఇది మన వస్త్ర ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసింది. సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో 60 అగ్ర వస్త్ర ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలతో మాట్లాడి సీఐటీఐ ఈ నివేదికను విడుదల చేసింది. పోటీని తట్టుకుని నిలబడటానికి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్టు 67 శాతం ఎగుమతిదారులు తెలిపారు. ఈ క్రమంలో నష్టాలను భరించాల్సి వస్తున్నదని సీఐటీఐ సెక్రెటరీ జనరల్ చంద్రిమా ఛటర్జీ పేర్కొన్నారు. 'వస్త్ర పరిశ్రమ స్వల్ప మార్జిన్ కలిగిన వ్యాపారం. అయినప్పటికీ, వినియోగదారులను పోగొట్టుకోకుండా ఉండేందుకు చాలా కంపెనీలు డిస్కౌంట్లు ఇస్తూ నష్టాలను భరిస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఏదైనా ఉపశమనం కలుగుతుందని వస్త్ర పరిశ్రమలు ఆశిస్తున్నాయి' అని ఛటర్జీ పేర్కొన్నారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2.3 శాతం వాటా కలిగిన, 4.5 కోట్ల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమలు పెట్టుబడుల ప్రవాహం మందగించడం సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దానికితోడు సుంకాల ప్రభావంతో అమ్మకాలు తగ్గిపోయి, ఆదాయాలు పడిపోయినట్టు భారతీయ వ్యాపారులు చెప్తున్నారు. అమెరికన్ల నుంచి డిస్కౌంట్ల కోసం అభ్యర్థనలు (30 శాతం), ఆర్డర్లను రద్దు చేయడం లేదా వాయిదా వేయడం (25 శాతం), ఆర్డర్ మొత్తంలో కోత (20 శాతం) తదితర కారణాల వల్ల ఆదాయాలు గణనీయంగా పడిపోయినట్టు పేర్కొంటున్నారు. ఆర్డర్ల మందగమనం కారణంగా గోదాంలలో స్టాక్ పేరుకుపోయి 85 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ ఎగుమతిదారులు సతమతమవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 2025 సెప్టెంబర్‌లో వస్త్రాల ఎగుమతులు 10.34 శాతం తగ్గడం ఏ మాత్రం ఆశ్చర్యపరచలేదు. తత్ఫలితంగా చాలా మంది ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) తీవ్రమైన మూలధన వ్యయం కొరతను ఎదుర్కొంటున్నాయి. అంతేకాదు, మూలధన వ్యయం అవసరాలు 30 శాతానికి పైగా పెరిగినట్టు 40 శాతం మంది ఎగుమతిదారులు నివేదించారు. ఇది వస్త్ర రంగంలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడిని నొక్కిచెప్తున్నది.

భారతీయ వస్త్రాలపై అమెరికా సుంకాల ప్రభావం దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలు ఆర్డర్ల రద్దుతోపాటు పోటీతత్వాన్ని తట్టుకునేందుకు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నాయి. వియత్నాం, బంగ్లాదేశ్ వంటి తక్కువ సుంకం ఉన్న దేశాలతో పోటీపడుతున్నందున పెద్ద, చిన్న పరిశ్రమలు కూడా తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. అంతా స్థిరపడిన తరుణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు తమ వ్యాపారాలను నాశనం చేసిందని సూరత్‌కు చెందిన జేపీ కాచివాలా కంపెనీ డైరెక్టర్ ధర్మేష్ కాచివాలా ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం పూర్తిగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడ్డాం. యూఎస్ వినియోగదారులు కోరినట్టుగా అధిక నాణ్యతతో కూడిన వస్త్రాలను తయారు చేస్తాం. కాబట్టి, మా పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. సుంకాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లపై దృష్టిసారించాలని ఇప్పుడు సలహా ఇస్తున్నారు. కానీ, పోటీ తీవ్రంగా ఉంది. అంతేకాదు, దేశీయ మార్కెట్ లాభదాయకం కాదు' అని ఆయన చెప్పారు. దేశంలోని వస్త్ర పరిశ్రమ కుదేలైంది. ఒక్క సూరత్‌లోనే ఉత్పత్తిలో 30-40 శాతం క్షీణత, రూ.7,200 కోట్లకు పైగా ఆదాయం కోల్పోయినట్టు అంచనా. ఈ నేపథ్యంలో కర్మాగారాలు పనిదినాలను తగ్గించుకుంటున్నాయి. డిమాండ్ పడిపోవడంతో వస్త్ర పరిశ్రమలు ప్రమాదంలో పడ్డాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉంది. కానీ, ఇది మూణ్నాలుగు నెలల్లో తగ్గిపోతుందని కాచివాలా అంచనా వేశారు. 'మేం ఇతర ఎగుమతి మార్కెట్లను అన్వేషిస్తున్నాం. కానీ, కొత్త మార్కెట్లలో పాగా వేసేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. అమెరికాతో పోలిస్తే యూరోపియన్ మార్కెట్ల పరిమాణం చాలా తక్కువ. గత మూడు నెలలుగా మా పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు' అని ఆయన చెప్పారు.